
# కృష్ణవేణి



లెఫ్టినెంట్ కుమారి పి. వకుళ

జడ్జి వరంధామయ్యగారు కోర్టుకెళ్ల టానికి తయారై, 'ఈ రోజు కూర లేమిటి కృష్ణా' అంటూ డైనింగ్ హాలు లోకి ప్రవేశించారు. అప్పటికే, వేణు, శశి, శంకర్ 'డైనింగ్ టేబుల్' దగ్గర తండ్రి కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు.

శశి తన ప్లేటులో కూరలు చూసి, 'ఆ, ఈ రోజు నేను చిక్కుడుకాయ వేపుడు చెయ్యమన్నాను గదక్కా. ఈ కూరలు నాకే మక్కరలేదు' అని అలిగి కూర్చుంది.

'వెంకన్నను మార్కెట్టుకు పంపానమ్మా. చిక్కుడుకాయలు ఇంకా రాలేదన్నాడట. ఇంకొక వారం రోజులలో మన పెరట్లో కాయలు వస్తాయి — వండుకుందాములే, ఈ రోజుకు తినమ్మా' అని నెమ్మదిగా చెప్ప టానికి ప్రయత్నిస్తోంది కృష్ణవేణి.

'ఇదిగో, కృష్ణా పిల్లలను నువ్వే చెడుపు తున్నావు. లేకపోతే, పదిహేడు సంవత్సరాల పిల్లను నువు అలా బ్రతిమాలటం ఏమిటి?' అంటూ కసురుకున్నారు తండ్రి

'ఏదో, చిన్న పిల్లలెండి బాబుగరూ. నేను చూసుకుంటానుగా, మీకెందుకు మీరు భోంచెయ్యండి' అని బ్రతిమాలి ఆ పిల్లచేతగూడా భోజనం చేయించ గలిగింది.

పరంధామయ్యగారిని కోర్టుకు, పిల్ల లను కాలేజీలకు పంపి కృష్ణవేణి ఇంట్లోకి వచ్చింది.

* * *

పదిహేను సంవత్సరాల క్రితం, ఆ ఇంటి ఇల్లాలు అన్నపూర్ణకు నాలుగవ పురుడు కష్టమై కాలధర్మం చెందినపుడు, ఆమె తల్లి, పరంధామయ్యగారి మేనత్త అయిన కామేశ్వరమ్మగారు కృష్ణవేణిని ఆ ఇంటికి తీసుకురావటం జరిగింది. మంచి సాంప్ర దాయం కలిగి తక్కువస్థితిలో ఉన్న కృష్ణ వేణి తల్లిదండ్రులకు ఆమెను అల్లుడికిచ్చి పెళ్లిచేస్తానని హామీ ఇవ్వటం జరిగింది. ఎదిగిన పిల్లకు పెళ్లి ఎలా చెయ్యాలా, అని బెంగతో ఉన్న కృష్ణవేణి తల్లిదండ్రులు, వివాహం చేస్తానన్న కామేశ్వరమ్మగారి మాటలకు ఒగ్గక తప్పిందికాదు

ఎలిమెంటరీ స్కూలుతోనే చదువాపు చేసి సహజ సిగ్గరి అయిన కృష్ణవేణికి

ఆ ఇంట్లో బెరుకు బెరుకుగా తిరగసాగింది. ఇది గమనించిన కామేశ్వరమ్మగారు, 'చూడమ్మా కృష్ణా, ఈ ఇంటిబాధ్యత నీకప్పగిద్దామని నన్నిక్కడకు తీసుకొచ్చాను. నువ్విలా వేరువేరుగా తిరిగితే కుదరదు. పిల్లలను మాలిమిచేసుకొని, ఇంటిపరిస్థితులు అర్థంచేసుకుంటే, నేను అబ్బాయితో మాట్లాడి ఆ పని కాస్త కానిచ్చి నాదారిన నేను పోతాను' అన్నారు.

ఏడు సంవత్సరాల రఘు, ఐదు సంవత్సరాల వేణు, మూడు సంవత్సరాల శశిగూడా, 'అమ్మమ్మా ఈ అమ్మాయి ఎవరు?' అని అడుగుతున్న ప్రశ్నలకు ఆవిడ 'పిన్నిబాబూ' అని సమాధాన మివ్వటం, అందుకు వాళ్ళు, 'కాదు అక్క' అనటం ప్రక్కగదిలోనుండి వింటున్న పరంధామయ్యగారు నిట్టూర్చారు.

'అక్కా, అక్కా' అంటూ పిల్లలు ముగ్గురూ కృష్ణవేణిచుట్టూ తిరుగుతూ, అన్నీ ఆమే చెయ్యాలని పంతంపట్టి కూర్చోవటంతో, కృష్ణగూడా వాళ్లలో ఒకపిల్లలాగా కలిసిపోయి, వాళ్ళ పనులన్నీ తనే చెయ్యసాగింది. ఉయ్యాలలో ఉన్న ఏడాది బాబును హృదయానికి హత్తుకొని ముద్దులతో నింపేసేది. ఇదంతా 'శశి' ఆశ్చర్యంగా చూస్తుంటే సిగ్గుపడిపోయేది కృష్ణవేణి.

కృష్ణలో వచ్చిన మార్పు చూసి కామేశ్వరమ్మగారు సంతృప్తిపడి, అల్లుడితో పెళ్లి విషయం కదిపారు. అప్పటికి ఇంకా అన్నపూర్ణ జ్ఞాపకాలు వదలని పరంధామయ్యగారు 'ఇపుడు నాకు చేసుకోవాలని లేదు' అని దాటవేశారు.

కామేశ్వరమ్మగారు అల్లుడు తనముందు మొఖమాట పడుతున్నాడని, కృష్ణవేణిని ఇంట్లో అట్టేపెట్టి, ఇంటిదగ్గర పని ఉంది, త్వరలోనే వస్తానన్న నెపంతో ఆవిడ ఇంటికి వెళ్లిపోయారు.

ఎన్నాళ్ళయినా కామేశ్వరమ్మగారు తమ కుమార్తె పెళ్లి విషయం చెప్పలేకపోవటం, ఆవిడ అల్లుడి ఇంటికి వెళ్లకపోవటము గమనించి, కృష్ణవేణి తల్లిదండ్రులు కుమార్తెను చూడాలన్న కోర్కెతో, కామేశ్వరమ్మగారినిగూడా ప్రయాణం చేయించి పట్నంలో ఉన్న పరంధామయ్యగారి ఇంటికి చేరుకున్నారు.

వెళ్లేసరికి ఎలాంటి పరిస్థితి ఎదుర్కోవలసి వస్తుందోనని భయపడుతున్న కామేశ్వరమ్మగారు అక్కడి వాతావరణం చూసి గుండెలనిండుగా ఊపిరి తీసుకున్నారు. రఘుకు, వేణుకు తలదువ్వి స్కూలుకు పంపటానికి తయారుచేస్తున్న కృష్ణను, చీర కుచ్చిళ్ళు పట్టిలాగుతూ, 'అక్కా, నాకు' అంటోంది శశి. ప్రక్కనే ఉయ్యాలలో స్నానం చేయించి పడుకోబెట్టిన బాబు, తన బోసినోటితో నవ్వులు చిందిస్తూ కేరింతలు కొడుతున్నాడు.

తల్లిదండ్రులను చూసిన కృష్ణవేణి, నవ్వుతూ వారిని ఆహ్వానించింది. 'పిల్లలకు టైమైపోతోంది, వాళ్లను స్కూలుకు పంపిస్తాను. ఈ లోపల మీరు పనులు కానివ్వండి' అని సమాధానంకోసంగూడా చూడకుండా వంట ఇంట్లోకి వెళ్లింది. అన్నీ తయారుగాపెట్టి, 'రఘూ, నాన్నగారిని భోజనానికి పిలువు' అని ఖబురు పెట్టింది. ఆ పిలుపుకోసమే ఎదురు చూస్తున్న పరంధామయ్యగారు తన గదిలోనుండి బయటకువచ్చి అత్తగారిని పలుకరించి, భోంచెయ్యటానికి వెళ్లిపోయారు.

నలుగురి పిల్లల తండ్రి ఎలా ఉంటాడోనని అనుకుంటున్న కృష్ణవేణి తల్లిదండ్రులకు ముప్పై సంవత్సరాల వయస్సులో మంచి ఆరోగ్యంతో పచ్చగా ఉన్న పరంధామయ్యగారిని చూసి సంతృప్తిగా నిట్టూర్చారు.

పరంధామయ్యగారు కోర్టుకు, మగపిల్లలిద్దరూ స్కూలుకు వెళ్లాక, శశికి భోజనం కలిపిపెట్టి తింటుంటే, బాబుకు పాలు పడుతూ కూర్చుంది కృష్ణవేణి, ఆమెను చూస్తున్న తల్లిదండ్రులకు రెండు నెలల క్రితంవరకు తమ దగ్గర అతి అమాయకంగా పెరిగి వచ్చిన 'కృష్ణ' కాదనుకున్నారు.

ఆ రాత్రి కామేశ్వరమ్మగారు అల్లుడిని పెళ్లివిషయం కదిపితే, కొద్ది రోజులలో తను అమెరికా వెళ్లబోతున్నట్లు చెప్పాడు.

అందుకామె నివ్వెరపోతూ, 'అదేమిటి బాబూ, ఇన్నాళ్లూ లేని అమెరికా ఇపుడే వచ్చింది? ఈ పిల్లలను ఏంచేద్దామనుకుంటున్నావు. ఇన్ని రోజులనుండి పెళ్లి మిషతో ఈ ఇంట్లో అట్టిపెట్టిన కృష్ణవేణిని ఏంచేద్దామనుకుంటున్నావు?' అన్నారు.

'ఈ మధ్యనే నాకు ఈ ఆలోచన వచ్చింది. ఆ అమ్మాయి ఇష్టమయితే ఇక్కడే ఉంటుంది. లేకపోతే, పిల్లలను కాన్వెంటులో చేరుస్తాను' అని అంతకన్నా తను చెప్పవలసినది ఏమీలేదని ఆయన అక్కడినుండి లేచి వెళ్లిపోయారు.

వీరి సంభాషణ ప్రక్కగదిలోనుండి కృష్ణవేణి, హాలులోనుండి ఆమె తల్లిదండ్రులుగూడా విన్నారు.

మరునటి దినం వారు ప్రయాణమవుతూ కృష్ణవేణినిగూడా ప్రయాణం కమ్మన్నారు కాని, అందుకామె సుతరామూ ఒప్పుకోలేదు. ఎంత చెప్పినా వినకపోయే సరికి వాళ్ళు విసిగిపోయి 'నువ్వు మాపిల్లవే కాదనుకుంటా'మని కోపంగా వెళ్లిపోయారు.

ఆ తరువాత నెల రోజులకు ఇంటి బాధ్యత, పిల్లలబాధ్యత నిస్సంకోచంగా కృష్ణవేణిపై వదలి పరంధామయ్యగారు విదేశాలకు ప్రయాణమై వెళ్లారు.

ఆయన విదేశాలలో ఉన్న మూడు సంవత్సరాలలోను, ప్రతి సోమవారం ఆయన దగ్గరినుండి వచ్చే లెటరుకోసం ఆతృతతో ఎదురుచూస్తుండేది. ఆయన రాసే ఆ లెటరులో కృష్ణపై ఎలాంటిభావం చూపెట్టేవాడు కాదు. తన నలుగురు పిల్లలతోపాటు ఆమెగూడా ఒకపిల్ల అన్న భావం వెలువడేది. కాని, ఒక్క తల్లిదండ్రుల ప్రేమ తప్పించి అన్యమెరుగని కృష్ణవేణికి, ఆయన లెటరులో తన పేరు కనిపిస్తేనే చాలన్న ఉద్దేశ్యంతో కొండెక్కినంత సంతోషపడి ఊహాలోకాల్లో తేలిపోయేది.

పరంధామయ్యగారు ఇంకొక నెల రోజులలో తను వస్తున్నానని రాసిన లెటరు చూసి సంతోషం పట్టలేక, నాలుగు సంవత్సరాల 'శంకర్'ను ఎత్తుకొని ముద్దులతో నింపేసింది కృష్ణవేణి.

పిల్లలను తీసికొని విమానాశ్రయానికి వచ్చిన కృష్ణవేణినిచూసి పరంధామయ్యగారు ఆశ్చర్యపోయారు. ఆయన ఇన్నిరోజులు తన పెద్దకుమార్తెగా భావించుకుంటున్న కృష్ణవేణి ఇంత బంగారు బొమ్మలా ఉంటుందని ఊహించలేదు


తరువాత ఓరోజు పరంధామయ్యగారు కోర్టుకువెళుతూ, దగ్గరలో ఉన్న కృష్ణవేణితో, 'ఈ రోజు నా స్నేహితుడు వస్తాడు, తయారై ఉండు' అని చెప్పి వెళ్ళారు.

సాయంకాలం పిల్లలందరిని తయారు

చేసి, తనుకూడా సాధారణంగా అలంకరించుకొని వాళ్ళకోసం ఎదురుచూస్తూ కూర్చుంది కృష్ణ.

ఐదు గంటల ప్రాంతంలో పరంధామయ్యగారు ఒక పాతిక సంవత్సరాల యువకుడిని, ఒక ముసలాయనను వెంట బెట్టుకొచ్చారు. వారినిచూసి కృష్ణవేణి లోపలకు తప్పుకుంది.

లోపలగదిలో ఉన్న కృష్ణవేణికి వారి మాటలలో తనపేరు వినిపించేసరికి ఏమిటోనని చెవి ఒగ్గింది. ముసలాయన తన పుట్టుపూర్వోత్తరాల సంగతి అడుగుతుంటే ఆశ్చర్యపోయింది. తరువాత మాటలనుబట్టి వాళ్ళు తన పెళ్ళిచూపుల కొరకు వచ్చారని తెలుసుకొని నివ్వెరపోయింది. ఆమె మనసు పరిపరివిధాల ఆలోచించసాగింది 'ఇన్ని రోజులు పరాయి ఇంట్లో ఉన్నదంటే, లోకం తనను చూసి ఏమనుకుంటుంది? తను పవిత్రురాలననే అనుకుంటుందా? ఇన్నాళ్ళు వేరు ఆలోచనలతో గడిపిన తన మనస్సు రేపు అతనిపై లగ్నం కాగలదా? ఇపుడు కాకపోయినా కొన్నాళ్ళ తరువాతనయినా అతనికి తనపై అనుమానం రాదా? అపుడేమిటి తనకుదారి?




# కృష్ణవేణి

ఆ తరువాత తనకు ఈ మాత్రం ఆలంబన గూడా దొరకదే?' ఇలా ఆలోచిస్తున్న కృష్ణవేణికి కన్నీళ్ళాగలేదు. కృష్ణకన్నీళ్ళు చూసిన శశి తండ్రిదగ్గరకు వెళ్ళి, 'నాన్నారూ, అక్క ఏడుస్తోంది' అని ఫిర్యాదు చేస్తుంది.

ఏం జరిగిందోనని ఖంగారుగా గదిలోకి వచ్చిన ఆయన కృష్ణవేణినిచూసి ఏం చెయ్యాలో తెలియక తికమకపడ్డారు. పరంధామయ్యగారిని చూసిన కృష్ణ ఆయన పాదాలపైవాలి, 'బాబూగారూ, నన్ను ఈ ఇంట్లోనుండి పంపివెయ్యకండి' అంది వెక్కుతూ.

'అదేమిటమ్మా, నువు నాకు పెద్ద కూతురు లాంటిదానివి. నువు ఈ కుటుంబానికి చేసినమేలు నేను ఈ జన్మలో మరిచిపోలేను. ఇపుడు నీ పెళ్ళిబాధ్యత నామీద ఉంది. అది కాస్తా అయిందంటే, నాకు సగంబాధ్యత తీరినట్లే. నువు అభ్యంతరం చెబుతావని ముందుగా నీకు తెలియజెయ్యలేదు' అన్నారు.

'నాకసలు పెళ్ళి చేసుకొనే ఉద్దేశ్యం లేదు. బాబుగారూ, నన్నిక్కడనుండి పంపివెయ్యకండి. అలా జరిగితే మీరు నాశవాన్నే చూడవలసి వస్తుంది.' అని గట్టిగా చెప్పటంతో ఆశ్చర్యపోయిన పరంధామయ్యగారు, ఇంకేమీ చెయ్యలేక, కొన్నాళ్ళు వాయిదావేసి చూద్దామని, అప్పటికి వచ్చినవారికి క్షమాపణలు చెప్పుకొన్నారు.

ఆ తరువాతగూడా ఆయన ఆప్రస్తావన తెచ్చినపుడల్లా కృష్ణవేణి విముఖత చూపటం జరిగింది. కాలగర్భంలో పన్నెండు సంవత్సరాలు కలసిపోయాయి. ఈకాలంలో పరంధామయ్యగారికి జిల్లా జడ్జిగా ప్రమోషన్ రావటము, పిల్లలు పెరిగి కృష్ణవేణిని 'అక్కా' అని పిలుస్తున్నా, ఆమె తల్లికి మించిన మమకారం వారిపై పెంచుకోవటం జరిగింది. కాని, పరంధామయ్యగారి ఆలోచనలు, ప్రవర్తనలో ఏమాత్రం మార్పురాలేదు.

ఇపుడు రఘు డాక్టరుకోర్సు పూర్తి చేసి గవర్నమెంటు హాస్పిటల్లో 'హౌసర్జన్సీ' చేస్తున్నాడు. రెండవవాడు వేణు ఇంజనీరింగు నాలుగవ సంవత్సరము, శశి బి.ఎ. రెండవ సంవత్సరము, శంకర్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు.

రఘుకు, శశికి ఒకేసారి పెళ్ళిచేద్దామన్న ఉద్దేశ్యంతో పిల్లను చూసివచ్చారు. అన్నీ నచ్చటం, ఖాయం చేసుకోవటంగూడా జరిగిపోయింది. ఆ అమ్మాయి 'మల్లిక' గూడా అక్కడే డాక్టరు ఆఖరు సంవత్సరంలో ఉంది, ఇంకా శశికి సంబంధాలు వెతుకుతున్నారు. మొదట పరంధామయ్యగారు ఇపుడే పెళ్ళిళ్ళు చెయ్యటానికి ఇష్టపడకపోయినా కృష్ణవేణి బలవంతంవల్ల కార్యోన్ముఖులు కావటం జరిగింది.

'అక్కా' అన్న రఘు పిలుపుకు. షర్టుకు ఊడిపోయిన గుండీలు కుడుతున్న కృష్ణవేణి హాలులోకి వచ్చింది.

'అక్కా ఈ రోజు డ్యూటీ ఉంది. త్వరగా భోజనం పెట్టు నేను వెళ్ళాలి' అని కాళ్ళు కడుక్కోవటానికి దొడ్లోకి వెళ్ళాడు.

'అదేం, బాబూ మొన్ననేగదా డ్యూటీ చేశావు. అపుడే ఏమిటి?'

'మా అసిస్టెంట్‌కు కొంచెం పనదో ఉందట. అందుకని ఈ రోజు ఆయన బదులు నన్ను చూసుకోమన్నారక్కా.'

రఘు ఫోంచేసి వెళ్ళిన కొంచెంసేపటికి శశి కాలేజినుండి వచ్చి, కృష్ణ మెడచుట్టూ చేతులువేసి, 'అక్కా రేపు ఆదివారంగదా, మావాళ్ళంతా 'పిక్నిక్'కు వెళ్తున్నారు నన్నుగూడా పంపవా' అంది గారాంగా.

'ఎలాగమ్మా, రేపు బందరునుండి నిన్ను చూడటానికి వాళ్ళు వస్తామన్నారు గదా, ఎలా వెళ్తావమరి' అంది మొఖానపడ్డ వెంట్రుకలు సరిచేస్తూ.

'ఫో అక్కా, నువు ఎపుడూ ఇంతే. ఆరోగ్యం పాడవుతుందని ఏదో ఒక వంక చెప్తావు. నే నసలు పెళ్ళి చేసుకోను. నువు చేసుకోలేదుగదా. నేనూ ఇక్కడే ఉండిపోతాను' అంది బుంగమూతి పెడ్తూ.

'ఛ. తప్పుతల్లీ, పెళ్ళిచేసుకొని పిల్లాపాపలతో నీ కాపురం కళకళలాడుతుంటే చూసి సంతోషించవలసిన వాళ్ళం మేము. అలా అనగూడదమ్మా. రా, నీకు టిఫిన్ పెడతాను' అని పమిట చెంగుతో కళ్ళొత్తుకుంటూ వంటింట్లోకి దారితీసింది కృష్ణవేణి. ●